క్లుప్తంగా

వాహనం ఢీకొని కుంగిన విద్యుత్ స్తంభం



విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

పెదగంట్యాడ: ఫైర్ స్టేషన్ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో విద్యుత్ స్తంభం కుంగిపోయింది. స్తంభం అడుగుభాగం మొత్తం ఛిద్రం కావడంతో కూలిపోయే స్థితిలో నిలిచింది. సమాచారం అందుకున్న ఈపీడీసీఎల్ ఏఈ శివ దుర్గాప్రసాద్ వెంటనే స్పందించి, సిబ్బందిని అప్రమత్తం చేశారు. యుద్ధప్రాతిపదికన ఆ స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్త స్తంభం వేశారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



గంగవరం పోర్టు వంతెన నుంచి స్టీల్‌ప్లాంట్ బీసీ గేటుకు వెళ్లే రోడ్డులో పార్క్ చేసిన లారీలు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు వంతెన నుంచి స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వరకు అదానీ గంగవరం పోర్టుకు వచ్చి వెళ్లే లారీలు, ట్రాలీలు, ట్యాంకర్లను రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మార్పుపూడి పరదేశి పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తారని, వారికి ఇబ్బంది కలుగుతోందని తెలియజేశారు. వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఈ మేరకు న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ పెద్దాడ రాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వాహనాలు రోడ్డుపై పార్క్ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవుని సన్నిధిలో రేపటి నుంచి పవిత్రోత్సవాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక బహుళ ద్వాదశి శనివారం వరకు శ్రీవారి సన్నిధిలో త్రయాహ్నిక దీక్షతో పాంచరాత్ర దివ్య ఆగమ విధానంలో ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బహుళ ఏకాదశి శుక్రవారం సామూహికంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం చేస్తామన్నారు. 7న ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహిస్తామని తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మంగళాశాసనం, సాయంత్రం విశేష హోమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30గంటల నుంచి ఈకార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను సింహాసనంపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చిన్నా, శ్రీకాంత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చీకటిలో చిరుదీపంలా..

- రైల్వే ట్రాక్ నివాసితుల జీవితాల్లో వెలుగులు
- విద్యుత్, కుళాయిల ఏర్పాటుతో తీరిన వెతలు

చుట్టూ చీకటి కమ్ముకున్న వేళ చిన్న చిరుదీపమే అయినా ఎంతో వెలుగునిస్తుంది. గుక్కెడు నీటి కోసం ఎంతో దూరం వెళ్లాల్సిన పరిస్థితుల్లో అందుబాటులోనే కుళాయిలు ఏర్పాటు చేస్తే అంతకంటే ఆనందం ఏం ఉంటుంది? అక్కిరెడ్డిపాలెం రైల్వే ట్రాక్ నివాసితుల సంతోషానికి కారణమిదే. కుళాయిల ఏర్పాటుతో తాగునీరు అందుబాటులోకి వచ్చింది. విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో వీధుల్లోనే కాదు.. వారి జీవితాల్లోనూ వెలుగులు నిండాయి. ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా తమ గురించి పట్టించుకునేవారే లేకపోయారని.. కానీ వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇళ్లు కూడా వచ్చాయని ఎంతో ఆనందంగా చెబుతున్నారు.



అక్కిరెడ్డిపాలెం రైల్వే ట్రాక్ రహదారిపై విద్యుత్ వెలుగులు

అక్కిరెడ్డిపాలెం: తాగు నీరు, విద్యుత్ లైట్ల ఏర్పాటుతో దశాబ్దాల కల నెరవేరిందని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం ట్రాక్ నివాసితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి, జీవనోపాధి కోసం అక్కిరెడ్డిపాలెం రైల్వే ట్రాక్ పక్కన నివాసాలు ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డారు. సుమారు 40 సంవత్సరాల నుంచి 150కు పైగా కుటుంబాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ మారుమూల పల్లెల నుంచి వచ్చాయి. వీరికి సరైన నివాసం, మంచినీటి సౌకర్యం, విద్యుత్ వసతులు లేవు.

గతంలో నాయకులు ఎన్నికల సమయంలో వచ్చి అది చేస్తాం, ఇది చేస్తాం అంటారే కానీ వారికి ఏదీ చేయలేదని నివాసితులు తెలిపారు. కనీసం తాగటానికి గుక్కెడు మంచి నీటికి కుళాయిలు, వీధి దీపాలు ఏర్పాటు చేయమని కోరినా ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడు ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని, 20 తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో తాగు నీటి కష్టాలు, విద్యుత్ సమస్య తీరాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయని, ఆయనకు రుణపడి ఉంటామని తెలియజేస్తున్నారు.



అక్కిరెడ్డిపాలెం రైల్వే ట్రాక్ నివాసాలకు ఏర్పాటు చేసిన మంచి నీటి కుళాయి





రైల్వే ట్రాక్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ పోల్

ఎన్నో ఏళ్లుగా తాగునీటికి అలమటించాం...



గతంలో తాగునీటికి ఎక్కడికెక్కికో వెళ్లాల్సి వచ్చేది. ఒక్కోసారి తాగునీరు లేని పరిస్థితి. గతంలో ఎందరో నాయకులను తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయమంటే చులకనగా మాట్లాడారు. ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా ఏర్పాటు చేశారు. దినసరి కూలీలుగా జీవిస్తున్న మమ్మల్ని జగన్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోంది.

– జానకి, అక్కిరెడ్డిపాలెం

మా ప్రాంతంలో వెలుగు వచ్చింది



రాత్రి సమయంలో చిమ్మ చీకటిలో విష కీటకాలు, పాములు, కుక్కలతో ఇబ్బందులు ఎదుర్కొనేవారం. కానీ ఇప్పుడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో, మా ప్రాంతమంతా వెలుగులు విరజిమ్ముతోంది. ఎన్నో ఏళ్ల సమస్యను ఇట్టే పరిష్కరించారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అడగకుండానే ఎన్నో చేస్తున్నారు. కృతజ్ఞతలు.

– తిరుమల, రైల్వే ట్రాక్ నివాసి, అక్కిరెడ్డిపాలెం

పథకాలన్నీ అందుతున్నాయి



ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న సమస్యలను పరిష్కరించారు. మాకు సంక్షేమ పథకాలన్నీ అందిస్తున్నారు. ఇళ్లు లేని మాకు సొంత ఇళ్లు ఇచ్చారు. స్థానిక నాయకులు మా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు.

– కె.గౌరి, అక్కిరెడ్డిపాలెం

పేదలకు మేలు చేశామన్న సంతృప్తి



ఎన్నో సంవత్సరాలుగా పలు ప్రాంతాల నుంచి వలస వచ్చి పేదలకు కనీసం తాగునీటి సౌకర్యం లేకపోవడం కలచివేసింది. రైల్వే ట్రాక్ పక్కన సుమారు 150కు పైగా కుటుంబాలకు మంచినీరు, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లాను. ఎమ్మెల్యే సహకారంతో తాగు నీటి కుళాయిలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశాం. వారి ఆనందం చూసి సంతృప్తి కలిగింది.

– గుడివాడ అనూష, 68వ వార్డు కార్పొరేటర్

వాన జోరు.. జనం బేజారు

- రెండో రోజూ తెరిపివ్వని వాన
- గాజువాకలో 4.42 సెంటీమీటర్లు నమోదు



గంగవరం పోర్టు ప్రధాన గేటు సమీపంలోని గెడ్డలో పూడికలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



రోజంతా ఇదే ముసురు



శీలానగర్‌కు వెళ్లే మార్గంలో నీటి మునిగిన రోడ్డు

గాజువాక: మిచాంగ్ తుపాను ప్రభావంతో గాజువాకలో తెరిపిలేకుండా వర్షం కురిసింది. తుఫాన్ కారణంగా రెండు రోజులపాటు ముసురుపట్టిన విషయం తెలిసిందే. తొలిరోజు ఓ మోస్తరుగా వర్షం కురిసినా.. రెండో రోజైన మంగళవారం వాన వదల్లేదు. దీంతో గాజువాకలో పలుచోట్ల పల్లపు ప్రాంతాల్లో నీరు కొద్దిసేపు నిలిచిపోయింది. సుమారు 4.42 సెంటీమీటర్ల వర్షం కురిసినట్టు అధికారులు తెలిపారు. పలుచోట్ల రోడ్లు చెరువులుగా మారాయి. కాలువలు, రోడ్లు ఏకమై నీరు ప్రవహించింది. భారీగా కురిసిన వర్షంతో స్థానికులు అవస్థలు పడ్డారు. గాజువాక కణితి రోడ్డు, మెయిన్ రోడ్డు, శ్రీనగర్‌వద్ద జాతీయ రహదారి నీట మునిగింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. రోడ్లు చిత్తడిగా మారాయి. వర్షం నీటిని తొలగించడానికి జీవీఎంసీ గాజువాక జోనల్ అధికారులు చర్యలను చేపట్టారు. జోనల్ కమిషనర్ పి.సింహాచలం, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో వర్షం నీరు నిలిచిపోకుండా ఎక్కడికక్కడ అవసరమైన చర్యలను చేపట్టారు.

పొంగి పొర్లిన గెడ్డలు

పెదగంట్యాడ: తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు వర్షం ఏకధాటిగా కురుస్తూనే ఉంది. దీంతో గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లు చెరువులను తలపించాయి. రెండో రోజు మంగళవారం కూడా మండలంలోని పాఠశాలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. ఉదయం నుంచి రాత్రి వరకు జల్లులు పడడంతో జనజీవనం స్తంభించింది. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. మండలంలోని లోతట్టు ప్రాంతాలైన బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, రామచంద్రనగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోయింది. ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టింది. గెడ్డల్లో నీరు నిలిచిపోకుండా ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పూడికలు తొలగింపజేశారు. గంగవరం పోర్టు వంతెన వద్ద జేసీబీ సాయంతో పూడికలు తొలగించి, నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు.



సహాయ చర్యలపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న జోనల్ కమిషనర్ సింహాచలం



77వ వార్డు పిట్టవానిపాలెంలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

అక్కిరెడ్డిపాలెం: 68, 69 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు పొంగి పొర్లాయి. పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్, తోకాడ, శీలానగర్ ప్రధాన రహదారులు నీట మునిగాయి. అవుట్ లెట్లు లేకపోవడంతో రోడ్డుపై నిలిచిపోతోందని వాహనచోదకులు చెబుతున్నారు.

రోడ్లు జలమయం

కూర్మన్నపాలెం: వర్షానికి వడ్లపూడి జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై నీరు రోడ్లుపైనే నిలిచిపోయింది. ఆ దారిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



వర్షపునీటితో పొంగి ప్రవహిస్తున్న బర్మా కాలనీ గెడ్డ



ముస్తఫా జంక్షన్ వద్ద కురుస్తున్న వర్షం

ఈవీఎంలపై అవగాహన శిబిరాలు

- రేపటి నుంచి వచ్చే నెల 20 వరకు నిర్వహణ
- ఈఆర్వో లక్ష్మారెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గాజువాక : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లపై ఈ నెల ఏడు నుంచి నియోజకవర్గంలో అవగాహన శిబిరాలను నిర్వహించనున్నట్టు గాజువాక ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో) డి.లక్ష్మారెడ్డి తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులతో జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పోలింగ్ కేంద్రాలలోను వచ్చే నెల 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ శిబిరాల్లో ఓటర్లు పాల్గొని ఈవీఎంలపై వివరాలను తెలుసుకోవాలని కోరారు. గత నెల 28 నుంచి ఈ నెల 5 వరకు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. పదిమంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న గృహాలు గాజువాకలో ఇంకా 61 ఉన్నాయని, ఆ ఇళ్లల్లో 621 మంది ఓటర్లు ఉన్నారని తెలియజేశారు. వారం రోజుల్లోగా వాటి వెరిఫికేషన్ పూర్తవుతుందని పేర్కొన్నారు. అర్హులందరూ తమ ఓటు హక్కును ఈ నెల తొమ్మిదో తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈఆర్వోలు పి.సింహాచలం, ప్రసాద్‌బాబు, రమాదేవి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

అక్కిరెడ్డిపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైన ఓ వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సోమవారం రాత్రి 11.30 నుంచి 12 గంటల మధ్య సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తిని శ్రీనగర్ జంక్షన్, 100 ఫీట్ రోడ్డు మధ్యలో గుర్తు తెలియని ఓ వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో ఆ వ్యక్తి తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన పడిపోయారు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు అతడిని కేజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని, బ్రౌన్ కలర్ చెక్స్ షర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలియజేశారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో ఉంచామన్నారు. వివరాలు తెలిసిన వారు గాజువాక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలే ఆధారమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1027వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎల్‌ఎంఎంఎం, ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఈ కుట్రలను ఉద్యమాల ద్వారా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక తదియారాధన

సింహాచలం: సింహగిరిపై మంగళవారం కార్తీక తదియారాధనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అలయ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని దేవస్థానం అర్చకులు, అధికారులు నిర్వహించారు. దేవస్థానం ఉద్యోగులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, భక్తులు, సింహగిరి నిర్వాసితులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఏటా కార్తీక మాసంలో సింహగిరిపై తదియారాధన నిర్వహించడం పరిపాటిగా వస్తోందని స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తెలిపారు. దేవస్థానం ప్రధానర్చాకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, వైదికులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్‌డీసీ రామలక్ష్మి, ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సువ్వాడ శ్రీదేవి, బయ్యవరపు రాధ, దాశమంతులు రామలక్ష్మి, పెనుమత్స శ్రీదేవి వర్మ, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈ హరి, ఏఈవోలు నరసింహరాజు, పాలూరి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న ఈవో శ్రీనివాస మూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

అగనంపూడి: తుఫాన్ ప్రభావం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ (ఆర్‌ఈసీఎస్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో అగనంపూడి, పరిసర కాలనీల్లో ఆయన పర్యటించారు. మిచాంగ్ తుఫాన్ వల్ల రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వినియోగదారులకు ఇబ్బంది తలెత్తకుండా నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అగనంపూడికి చెందిన నాయకులు ఆయనకు సమస్యలు వివరించారు. విద్యుత్ వినియోగం పెరగడం వల్ల సరఫరాకు నిత్యం అంతరాయం కలుగుతోందని, వీటిని నిరోధించడానికి నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

7న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 7న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.



అష్టాదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

ఐవీఎఫ్ కేంద్రాల తనిఖీ

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో గల పలు ఐఆర్‌టీ, ఐవీఎఫ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆడమ్స్ ఐవీఎఫ్ కేంద్రంలో ఏఆర్‌టీ బ్యాంక్, పద్మశ్రీ ఐవీఎఫ్‌లో ఏఆర్‌టీ లెవల్-2, అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో ఏఆర్‌టీ లెవెల్-1, గీతం ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలకు పలు సూచనలు చేశారు. ఆపరేషన్ థియేటర్, వార్డు, స్కానింగ్ మెషీన్లను తనిఖీ చేశారు. ఆస్పత్రులకు ఏఆర్‌టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయో లేదో, వైద్యులు, ఉద్యోగుల విద్యార్హతలను పరిశీలించారు. ల్యాబ్ పరికరాలను పరిశీలించి సలహాలు ఇచ్చారు. ఈ కేంద్రాల్లో పేదవారికి ఫీజు తగ్గించి తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీ బృందంలో డాక్టర్ గీతా వందన, ఎల్.వి.రమణి, డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు, కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు



కాలి బూడిదయిన ఏసీ

గోపాలపట్నం: మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ఓ ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక జ్యోతి ప్లాజాలో మర్రిపాలెం ఉడాలేఅవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వాసుదేవరావు నివాసముంటున్నారు. ఇటీవల వాసుదేవరావు దంపతులు ఆస్ట్రేలియాలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి మంటలు, పొగ రావడంతో అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే మర్రిపాలెం ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు దగ్ధమయాయి. ఈ అగ్ని ప్రమాదం వల్ల సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఫైర్ అధికారులు ఆరా తీస్తున్నారు.